# ఎలుకలు

ఎలుకలు మందలు, మందలుగా వచ్చి పడుచున్నాయి...

పప్పులు, పుస్తకాలు, బట్టలు – ఏది కనిపిస్తే దాన్ని కొరికి వేస్తూ పళ్ళ దురద తీర్చుకుంటున్నాయి... అదిలించినా, బెదిరించినా ఎటూ పోకుండా మీది, మీదికి వస్తున్నాయి...

కర్ర తీసుకుని ఓ ఎలుక నడుం విరగ్గొట్టాడు.

ఎలుకలన్నీ మీటింగు పెట్టుకుని తనపై దాడికి సిద్ధమయ్యాయి... ఎలుకల దండు మీదకు ఉరికింది ... తనకు ఊపిరి ఆడకుండా ముట్టడి చేస్తున్నాయి... పళ్ళతో కొరుకుతున్నాయి... వొంటినిండా రక్తం మరకలు ...

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు వామనరావు.

ఎలుకలు కనిపించలేదు. ఒంటిమీద రక్తం మరకలు కూడా లేవు. కలలో కనిపించిన ఎలుకల్ని చూసి బెంబేలెత్తిపోయాడు తను. దడదడ కొట్టుకుంటున్న గుండెను దిటవు పర్చుకుని, ఇనప్పెట్టె పైన గోడమీద ఉన్న లక్ష్మీదేవిని మనస్సులో స్మరించుకున్నాడు.

అతనికి యాభైఏళ్లుంటాయి. మనిషి పొడుగు – గట్టిగా గాలివేస్తే కొట్టుకు పోయేటట్లు వుండే శరీరం – గంగా యమునల సంగమంలా కన్పించే సగం నెరసి తెల్లగా, నల్లగా కన్పించే గడ్డం – సిగరెట్టు పొగతో అక్కడక్కడ మీసంలో ఎర్రబారిన వెంట్రుకలు –

అతని దగ్గర ఏమున్నా లేకపోయినా మంచి మనస్సు వుంది. ఆ మంచి మనస్సు అతన్ని ఇబ్బందులకు గురిచేస్తూ ఉంది.

రైసు మిల్లు రొద యథాప్రకారంగా అతని చెవుల్లో దూరింది, ఎలుకల్ని మరచిపోయిన మరుక్షణంలోనే – రైసుమిల్లు వైపు రావొద్దని కూతురికి లక్షసార్లు చెప్పాడు. అయినా కనకలక్ష్మి రైసుమిల్లు ముందువైపున్న వరండాలో రాతి అరుగుల మీద అకౌంట్ పుస్తకాలు ముందేసుకుని కూర్చున్న తండ్రి దగ్గరకొచ్చింది.

“నాన్నా ! ఇంట్లో బియ్యం అయిపోయాయి” అందామె.

అరుగుల మీదే పేర్చివున్న బియ్యం బస్తాలకేసి ఒక క్షణం చూశాడు వామనరావు. ఇనప్పెట్టెమీద కూడా అతని దృష్టి పడింది. ఆలోచనలలో మునిగి పోయాడు.

... వందల కొద్దీ బియ్యం బస్తాలు లారిల్లోకి చేరుతుంటాయి. తన సైగలతోనే... నోట్ల కట్టలు తన చేతుల మీదుగా ఇనప్పెట్టెలోకి చేరుతుంటాయి....

తన ఇంట్లో మాత్రం దరిద్రం ...

.... కరుణ చూపమని కుబేరుడిని స్మరిస్తే కుచేలుడు ప్రత్యక్షమవుతున్నాడు....

... తను బాగా చదువుకొని పెద్ద ఉద్యోగం చెయ్యాలని తండ్రి కలలు కంటూ ఉండేవాడు... తను కాలేజీలో చేరినప్పుడు ఆయన ఆనందం వర్ణనాతీతం... స్కూల్లో, కాలేజీలో ఎప్పుడూ తను ఫస్టే!... బి.యస్.సి. ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు.

రైసుమిల్లు యజమాని ధర్మారావు తనతోపాటే చదువుకున్నాడు. ఉత్తమొద్దు. చదువులో... స్కూలుఫైనల్ గట్టెక్కలేక చదువుమానేశాడు... తెలివితేటలు లేని ధర్మారావు రైసుమిల్లు ఓనరయితే, తనేమో అతని దగ్గర గుమస్తాగా చేరవలసి వచ్చింది. ఎక్కడా ఉద్యోగం దొరక్క... తను చదివిన చదువుకి, ఉద్యోగానికి పొంతన లేదు...

“నువ్వు బాగా చదువుకో... వృద్ధిలోకి వస్తావ్! అనేవాడు తండ్రి ఎప్పుడూ తనతో.

.... బాగా చదువుకున్నంత మాత్రాన వృద్ధిలోకి రారని, ఉత్పత్తి, సాధనాలు చేతిలోవున్న వాళ్ళే ప్రపంచాన్ని శాసిస్తారని తండ్రికి ఏం తెలుసు? ...

వామనరావు ఆలోచనలనుంచి తేరుకుని తలెత్తి చూసేసరికి అతనికి అయిష్టమైన దృశ్యం కళ్ళలో పడింది.

రైసుమిల్లు యజమాని ధర్మారావు కనకలక్ష్మితో కబుర్లు చెబుతున్నాడు గేటు దగ్గర.

అప్పుడే విచ్చిన ఎర్ర గులాబిలా మిస, మిస లాడే పాతికేళ్ళ అమ్మాయిని మింగేటట్లు చూస్తూవున్నాడు ధర్మారావు. తనను ఆరాధనగా చూస్తున్న అతన్ని చూసి ముసి, ముసి నవ్వులు నవ్వుకుంటుందామె.

“అప్పుడే వెళ్ళిపోతున్నావేం?” నవ్వుతూ అన్నాడు ధర్మారావు.

అతను నవ్వుతూంటే అతని మెళ్ళోని బంగారపు గొలుసు కూడా కదులుతూ నవ్వుతున్నట్లనిపించిందా అమ్మాయికి.

"టౌనులో కొత్త సినిమా వచ్చింది.. మీ నాన్న తీసుకెళ్ళలేదా?" అడిగాడతను.

తల అడ్డంగా తిప్పింది.

"మెళ్ళో ఒంటి పేట గొలుసు కూడా లేదు... మంచి ఖరీదైన చీరలు కట్టుకోవు... మీ నాన్న ఏదీ కొనివ్వడా?"

మౌనంగా నిలబడిపోయింది కనక లక్ష్మి.

జేబులోకి చెయ్యి పోనిచ్చి యాభై రూపాయల నోటు బయటకు తీసి "మంచి వాసనొచ్చే పౌడరు డబ్బా కొనుక్కో" అంటూ ఆ అమ్మాయి చెయ్యి నుతారంగా నిమిరి అరచేతిలో ఆ నోటు ఉంచాడు.

అరుగుమీద కూర్చున్న తండ్రి వైపు చూసింది. కనకలక్ష్మి. కూతురుతో ధర్మారావు మాట్లాడుతుంటే కొరడాతో ఎవరో కొడుతున్నట్లనిపించింది వామనరావుకి. అరుగుమీద కూర్చోలేక వాళ్ళ దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

"ఓసీ మొద్దుమోహం... నీ సరదాలు ఒక్కటీ తీర్చలేదు... నీకు పాతికేళ్ళు వచ్చినా పెళ్ళి చేయ్యాలన్న ఇంగిత జ్ఞానం వాడికి లేదు... మీ అమ్మ బ్రతికి వున్నట్లయితే నీకు పెళ్ళి చెయ్యకుండా ఇంట్లో వుంచేదేనా? నీకేం భయంలేదు... తీసుకో!" ఆ అమ్మాయి చేతిలో నోటు అదిమి గుప్పిట మూశాడు ధర్మారావు.

తన వెనుక వామనరావు నిలబడ్డాడని దర్మారావుకు తెలుసు. అతనేమన్నా నోరు మెదిపితే "తిలకం సీసా కూడా కొనివ్వలేవు... నువ్వేం తండ్రివి?" అని ముక్క చీవాట్లు పెట్టడానికి సిద్ధంగా వున్నాడు ధర్మారావు. నోరు మెదవలేదు వామనరావు.

"రాత్రికి మీ ఇంటికి భోజనానికి రమ్మంటావా?" ఆ అమ్మాయి సొగసులు కళ్ళతోనే జుర్రుకుంటూ అడిగాడు ధర్మారావు.

అదే సమయంలో గేటు ముందు లారీ వచ్చి ఆగడంతో గేటు దగ్గర నిలబడి ఆడపిల్లతో మాట్లాడుతూ నిలబడటం బాగుండదని లోపలికి వచ్చేశాడు ధర్మారావు.

గేటు దగ్గర నిలబడి కూతురుతో యజమాని మాట్లాడటం వామనరావు గమనించక పోలేదు. మండిపోతున్న వొంటిని చల్లబర్చుకోవడానికి లక్ష్మీదేవి బొమ్మకేసి చూస్తూ – ఒకటి, రెండు, మూడు – అనుకుంటూ వంద వరకూ అనుకున్నాడు మనస్సులో కోసం తగ్గడానికి – అతను చేసే ప్రయత్నాలలో అదొకటి.

అరుగు మీద పరుపు మీద కూర్చున్నాడు ధర్మారావు. ఎకౌంటు పుస్తకం అతని ముందు ఉంచబోయాడు వామనరావు.

అరుగుమీద మరో ప్రక్క పేర్చివున్న బియ్యం బస్తాల మీద కూడా గెంతులేస్తూ వున్న ఎలుకలను చూసి గతుక్కు మన్నాడు ధర్మారావు.

ఎలుకను చూడగానే వెన్నులో వణుకు పుట్టింది.

"ఎకౌంటు పుస్తకాలు పక్కన పడేసి ముందరి ఈ ఎలుకల పని పట్టివయ్యా! ఎవడిన్నా పిలిపించి రైసు మిల్లులో ఒక్క ఎలుక కూడా లేకుండా చెయ్యవయ్యా ముందు... సూరత్‌లో, మహారాష్ట్రలో రెండొందల మంది ఈ ఎలుకల మూలంగా చనిపోయారట... పేపర్లలో చదవలేదా నువ్వు?" భయపడుతూ అడిగాడు.

"మన ప్రాంతంలో లేదులెండి ప్లేగు వ్యాధి" వామనరావు సమాధానమిచ్చాడు.

"మన జాగ్రత్తలో మనం ఉండాలోయ్!"

"ఎన్ని జాగ్రత్తలు పడినా చావు ముంచుకువస్తే చావకతప్పదు. ప్లేగు వ్యాధినుంచి తప్పించుకుందామని కొంతమంది గుజరాత్ నుంచి మరో ప్రాంతానికి వలసపోతూ రోడ్డు ప్రమాదంలో పదిమంది చనిపోయారట" అన్నాడు వామనరావు.

వామనరావు మాటలు ధర్మారావుకు రుచించలేదు. "ప్లేగు వ్యాధి ఎలుకల ద్వారానే వస్తుందంటావా? పొద్దున్నే ఓ చచ్చిపోయిన ఎలుకను ఇంట్లోనుంచి బయట పడేశానయ్యా!" ఆందోళనగా అన్నాడు ధర్మారావు.

"అడవుల్లో, కొండప్రాంతాల్లో సంచరించే ఎలుకల నుంచి ఇళ్లలో తిరిగే ఎలుకలకు ప్లేగుకు సంబంధించిన బాక్టీరియా సోకుతుందటండీ. ఒక్కో ఎలుకలో వంద మిలియన్ల ప్లేగు వ్యాధి క్రిములు ఉంటాయట!"

"అయితే ఆ ప్లేగు వ్యాధి నాకు వస్తుందంటావా?" "మీ ఇంట్లో చచ్చిన ఎలకకు ఆ వ్యాధి క్రిములు ఉంటే వచ్చే అవకాశం ఉందండి" అన్నాడు వామనరావు.

రైతులు వడ్ల బస్తాలు ఎడ్లబళ్లమీద వేసుకుని రైసుమిల్లుకు రావడంతో వాళ్ళ సంభాషణ ఆగిపోయింది.

ధర్మారావు వ్యాపారం అభివృద్ధి కావడానికి మొదట్లో నాలుగైదు సంవత్సరాలు ఎంతో

శ్రమించాడు వామన రావు. తను శ్రమపడడం తప్పితే తన శ్రమకు తగ్గ ఫలితం దక్కకపోవటంతో అతనిలో అసంతృప్తి రోజురోజుకూ పెరిగిపోసాగింది.

'ధర్మారావుకు ప్లేగు వ్యాధి వచ్చి చచ్చిపోతే బావుణ్ణు.... రైసుమిల్లు మీద ఇన్‌కమ్‌టాక్స్ వాళ్లు, కమర్షియల్ టాక్స్ వాళ్లు వచ్చి పడితే బావుణ్ణు.... వాడి కాళ్లు, చేతులు పడిపోయి ఇంట్లో మంచానికి అతుక్కుపోతే రైసుమిల్లు పెత్తనం అంతా తన చేతికి వస్తే ఎంత బాగుంటుంది?'

ఛీ...ఛీ... వెధవ ఆలోచనలు.

ఎదుటివాడి ఓ కన్ను పోవాలని ఆలోచిస్తే మన రెండు కళ్లు పోతాయట. ఇక ముందెప్పుడూ అలా ఆలోచించకూడదు.

మెదడులో ఉప్పెనలా చెలరేగుతున్న ఆలోచనలకు ఆనకట్ట వేసి రైతులు తీసుకువచ్చిన వడ్ల బస్తాలను లెక్క పెట్టుకుని పుస్తకంలో రాసుకున్నాడు వామనరావు.

"ప్లేగు రాకుండా ఉండటానికి మన ఆరోగ్య కేంద్రంలో మందులేవో ఇస్తున్నారట. వెళ్లి తీసుకురా" వామనరావును పురమాయించాడు ధర్మారావు.

రైసుమిల్లుకు దగ్గర్లో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు వెళ్లి టెట్రాసైక్లిన్ కాప్స్యూల్స్ పొట్లంలో కట్టి తెచ్చి ధర్మారావుకు ఇచ్చాడు వామనరావు. ఆ పొట్లం లాల్చిజేబులో చేసుకున్నాడు ధర్మారావు.

"ఇంట్లో బియ్యం నిండుకున్నాయండి. ఓ బస్తా బియ్యం ఇప్పించండి" అడిగాడు వామనరావు.

"గాదెల్లో పందికొక్కుల్లా కరకరా నమిలేస్తున్నా ఏమిటి? మొన్నీ మధ్యనేగదా ఓ బస్తా పట్టుకెళ్ళావ్!"

"జీతంలో మినహాయించుకోండి."

"నా దగ్గర్నుంచి నువ్వు తీసుకున్న మొత్తం లెక్కచూస్తే నీకు మరో రెండేళ్ళదాకా పైసా జీతం రాదు. మిగతా లెక్కలన్నీ గుర్తు ఉంటాయిగాని, నీకు నీ జీతం లెక్కలు గుర్తుండవు" విసుగ్గా అన్నాడు ధర్మారావు.

మౌనంగా ఉండిపోయాడు వామనరావు. ధర్మారావు మాటలకు మనిషి మరింత కుదించుకుపోయాడు. తలెత్తి ధర్మారావు వైపు చూడలేకపోయాడు.

"సర్లే, ఓ బస్తా తీసుకెళ్లు" అనేసి అక్కడినుంచి లేచి రైసుమిల్లు బయటకు నడిచాడు ధర్మారావు.

ధర్మారావు వెళ్లిపోవడంతో జడివాన వెలిసినట్లయింది.

తాపీగా కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు వామనరావు. వెచ్చగా సిగరెట్ పొగ ఛాతీలోకి వెళ్లేసరికి కొత్త సత్తువ వచ్చినట్లనిపించింది. శారీరక రుగ్మతులు కొనితెచ్చేది అయినా జీవితంలో చివరికి మిగిలింది పొగతాగి ఆనందించడమే.

బంగారపు బొమ్మలా ఉండి పదేళ్లు తనను మురిపించి పైలోకాలకు వెళ్లిపోయిన భార్య గుర్తుకువచ్చింది.

భార్య చనిపోవడమే తన అన్ని కష్టాలకు మూలకారణం అనుకున్నాడు మనసులో.

మంచి ఉద్యోగం దొరకలేదు. కూతురి పెళ్లి కాలేదు. వచ్చే కొద్ది జీతంతో రోజులు గడవడమే కష్టంగా ఉంది, కూతురి పెళ్లి చెయ్యడం కూడానా? ఏ సంపన్నుడి కొడుకో తన కూతుర్ని గాఢంగా ప్రేమించి పెళ్లి చేసుకోకూడదూ?

"సార్! తొమ్మిదయింది, ఇంకా ఉన్నారేం?" నైట్ వాచ్‌మన్ వచ్చి అడిగేవరకూ ఆలోచనల దొంతరలో మునిగిపోయే ఉన్నాడు వామనరావు.

☆ ☆ ☆

భోజనం చేసి మంచంమీద పడుకున్నాడన్న మాటేగాని నిద్ర పట్టలేదు వామనరావుకి.

అటక మీద ఎలుకలు కిందకు దిగివచ్చి ఇంట్లో స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. చెక్క పెట్టెల్లోకి దూరి పుస్తకాలు కొరికేస్తున్నాయి. బట్టల మూటలో చేరి దుప్పట్లు, పంచెలకు చిల్లులు పెడుతున్నాయి.

ఎలుకలు పాత సామాను కదిలిస్తూ ఏదో కొరుకుతున్నట్లు చప్పుడు -

వామనరావు మంచంమీద నుంచి లేచి లైటు వేశాడు.

ఎక్కడి ఎలుకలు అక్కడ గుట్టుచప్పుడు కాకుండా జారుకున్నాయి.

లైటు తీసేసి పడుకున్నాడతను.

మళ్లీ ఎలుకలు యథాప్రకారం స్వేచ్ఛావిహారం మొదలుపెట్టాయి. అసహనంతో మంచంమీద నుంచి లేచి మళ్లీ లైటు వేశాడు.

ఈసారి ఎలుకలు ఓ క్షణం వెలుగును చూసి పక్కకు తప్పుకున్నాయి గాని, ఆ వెలుగుకు అలవాటు పడి ఇంట్లో మామూలుగా తిరగడం మొదలుపెట్టాయి.

ఓ నిర్ణయానికి వచ్చాడు వామనరావు.

రాత్రంతా మేలుకుని ఎలుకల భరతం పట్టాలి ! ఇంట్లో మూలనున్న కర్ర తీసుకున్నాడు.

అటక ఉన్న గదిలో కాపువేసి కూర్చున్నాడు.

ఓ ఎలుక వచ్చి వెనుక కాళ్లమీద కూర్చుని అతన్ని వెక్కిరిస్తున్నట్లు ముందుకాళ్లను మొహానికి రుద్దుకుంది. అతనికి ఒళ్లు మండిపోయింది. చేతిలో ఉన్న కర్రను ఎలుక మీదకు విసిరేశాడు. ఎలుక తప్పించుకుంది. అఖరికి ఎలుకలక్కూడా లోకువయ్యాడు.

గదిలో మూలనున్న కిరోసిన్ సీసాకు కర్ర తగిలి సీసా మూడు ముక్కలయింది. కిరసనాయిలు నేలపాలైంది.

గదంతా కిరోసిన్ వాసనతో గుప్పుమంది.

సీసా పగిలిన మోతకి కనకలక్ష్మికి మెలకువ వచ్చింది.

"ఎలుకను చంపుదామనుకుంటే తప్పించుకుపోయిందమ్మా" అన్నాడు కూతురితో.

"లైటు తీసేసి హాయిగా నిద్రపో నాన్నా? ఎలుకల గొడవ నీకెందుకు?" అంది కనకలక్ష్మి.

అప్పుడే ఎవరో వీధిగుమ్మం తలుపు తడుతూ పిలుస్తున్నట్లనిపించింది.

తలుపు తీశాడు వామనరావు.

ఎదురుగా ధర్మారావు పాలేరు సుబ్బయ్య కన్పించేడు.

"అయ్యగారికి వొళ్ళు కాలిపోతున్నదండీ... విపరీతంగా తలనొప్పి, వాంతులు... కదల్లేక పోతున్నారండీ వొకటే నీరసం అంట... తమర్ని డాక్టరు దగ్గరకు వున్నపళంగా వెళ్ళి తీసుకురమ్మన్నారండీ... ఊపిరి పీల్చడానిక్కూడ యిబ్బంది పడిపోతున్నారండీ"

"రాత్రిపూట డాక్టరు ఆరోగ్యకేంద్రంలో వుండడు గదా?" అన్నాడు వామనరావు.

"టౌన్లో ఉంటారటగదా డాక్టరుగోరు... తమర్ని వెంటనే టౌనుకు వెళ్ళి డాక్టరుగోరిని తీసుకురమ్మన్నారండీ... ఈ రాత్రికి రానంటే తమరు అక్కడే వుండి ఉదయాన్నే వెంటబెట్టుకు రమ్మన్నారండీ? ఖర్చులకు ఈ యాభై రూపాయలు దగ్గర ఉంచుకోమన్నారండీ?" యాభై రూపాయల నోటు బనీను జేబులోనుంచి తీసి ఇస్తూ అన్నాడు సుబ్బయ్య.

సుబ్బయ్య చెప్పిన మాటలు వినగానే వామనరావు ఏదో అనుమానం వచ్చింది.

... అనుమానం లేదు... ధర్మారావుకు ప్లేగువ్యాధి సోకింది... సుబ్బయ్య చెప్పినవన్నీ ప్లేగువ్యాధి లక్షణాలే... ఇంట్లో చచ్చిపోయిన ఎలుకను కూడ బయటపడేశానని చెప్పాడు ...

... ఆయన దగ్గరక్కూడ ఇప్పుడు తమ వెళ్ళగూడదు. తనక్కూడ ప్లేగు సోకుతుంది... వెంటనే టౌనుకువెళ్ళి డాక్టరును వెంటబెట్టుకు రావాలి...

కూతుర్ని తలుపువేసుకుని పడుకోమని చెప్పి టౌనుకు బయల్దేరేడు వామనరావు.

తెల్లవారగానే డాక్టర్ని వెంటబెట్టుకుని స్వగ్రామం చేరుకున్నాడు వామనరావు.

అతనికి ఆశ్చర్యం కల్గించిన విషయమేమిటంటే - ఇంటి ముందు వరండాలో ఒంటిమీద చొక్కాకూడ లేకుండా ఆదమరచి నిద్రపోతున్న ధర్మారావు కన్పించాడు.

అతన్ని నిద్రలేపి పరీక్ష చేయ్యడం మొదలుపెట్టాడు డాక్టరు.

"నాకేం సుబ్బరంగా ఉన్నానండీ డాక్టరుగారూ? మా వామనరావే కంగారుపడి టౌనుకు పరుగెత్తి మిమ్మల్ని తీసుకువచ్చాడు... రాత్రి నిద్రలేదు...ఇప్పుడే నిద్రపట్టింది... మీరొచ్చి నిద్రలేపారు" అన్నాడు ధర్మారావు.

పాలచెంబు ఇంట్లోకి తీసుకువెళ్తున్న ధర్మారావు తల్లి చెవిలో ఆ మాటలు పడ్డాయి.

"రాత్రంతా ఇంట్లో వుంటేగా నిద్రపట్టడానికి? ఎక్కడెక్కడో తిరిగి తెల్లవారుఝామున వచ్చి వరండాలో చేరాడు.. వాడికి ఒంట్లో బాగుండకపోవడమేమిటి?" అందామె విసుక్కుంటూ.

తల్లివైపు కోపంగా చూశాడు ధర్మారావు.

డాక్టరు గారికి, వామనరావుకు కాఫీ తెచ్చి ఇచ్చింది ధర్మారావు భార్య, కాఫీ తాగాక

ఇంటిమొహం పట్టాడు వామనరావు.

ఇంట్లో చలాకీగా తిరిగుతున్న కూతురు కనిపించింది. ఆమె తల్లోని వాడిన మల్లెపూలదండ చూసి ఆశ్చర్యపోయాడు.

... కనకలక్ష్మి తల్లో నిన్నగాని, రాత్రిగాని మల్లెపూలు కన్పించలేదే?...

... కూతురు మొహంలో ఆ వెలుగేమిటి?...

నీరసంగా మంచంమీద కూర్చున్నాడు వామనరావు.

అతనికి గదిలో ఓమూల చిన్న కాగితం పొట్లాం కన్పించింది. ఆ పొట్లాం విప్పదీసి చూశాడు.

అందులో టెట్రాసైక్లిన్ క్యాప్స్యూల్స్ కనిపించాయి.

అప్పుడు గుర్తుకు వచ్చింది. ఆ మందులు తను ఆరోగ్యకేంద్రం నుంచి తెచ్చి క్రిందటిరోజు ధర్మారావుకు ఇచ్చినవని.

... తన ఇంట్లోకి ఆ పొట్లాం ఎలా వచ్చింది?... ధర్మారావు రాత్రి ఎలుకగా ఇంట్లోకి దూరి, తన కూతురు కన్నెరికాన్ని కొరికేశాడన్న మాట....

... ప్లేగువ్యాధి కూతురికి సోకింది...

'అందుకు కారణమైన ఎలుకల'పై సమరానికి సిద్ధం కావాలి తను.. దుడ్డుకర్రతో 'వైల్డ్ రాట్'లా బలిసిన ధర్మారావు అంతు చూడాలి...."

రక్తంలోని ఎవరో సందేశాలు పంపుతున్నట్లని పించింది వామనరావుకి. *

**(ఆంధ్రప్రభ దీపావళి కథల పోటీల్లో బహుమతి పొందిన కథ - 27-11-1994)**